ప్రజాశక్తి

సోమవారం 23 డిసెంబర్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ప్రతి ఇంటికీ తాగునీరు ఎప్పుడో.?

- జిల్లాలో ముందుకు సాగని జలజీవన్ మిషన్ పనులు
- నిలిచిపోయిన 988 పనులు
- నిధుల మంజూరు కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా జిల్లాలో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు కూటమి ప్రభుత్వం హయాంలో కూడా ముందుకు సాగే పరిస్థితులు కనిపించడం లేదు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 3.64 లక్షల గహాలు ఉండగా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా గత వైసిపి ప్రభుత్వ హయాంలో 1,420 మంచినీటి సరఫరా పథకాల నిర్మాణాలకు రూ.587.55 కోట్ల నిధులు మంజూరు చేశారు.

జిల్లా పరిధిలో ఉన్న కొమ్మమూరు, సాగర్ కాలువలు,గుండ్లకమ్మ జలాశయం ద్వారా ఉన్న జలవనరులను వినియోగించుకుంటూ తాగునీటి అవసరాలను తీర్చేందుకు ▶ 2లో

జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పనుల వివరాలు

నియోజకవర్గం	మంజూరైన పనులు	విడుదలైన నిధులు	వివిధ దశల్లో ఉన్న పనులు
అద్దంకి	217	రూ.101.18 కోట్లు	20
బాపట్ల	164	రూ.47.38 కోట్లు	33
చీరాల	136	రూ.58.07 కోట్లు	47
పర్చూరు	267	రూ.166.19 కోట్లు	48
రేపల్లె	477	రూ.158.85 కోట్లు	151
వేమూరు	159	రూ.55.85 కోట్లు	34
మొత్తం	1420	రూ.587.55 కోట్లు	333

ఈ ఏడాదికి
ఆ ఐదు హామీలూ లేనట్లేనా.?

- సూపర్‌సిక్స్‌లో అమలులోకి వచ్చింది గ్యాస్ ఒక్కటే.!
- ఆర్టీసీ బస్సు ఉచితంపై అధ్యయన కమిటీ కాలయాపనకేనా.?
- తల్లికి వందనం, 'నెలకు రూ.1500' ఎప్పుడా.? అని మహిళల ఎదురుచూపులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికల ఏడాది ముగియనుంది. మరో వారం రోజుల్లో కొత్త ఏడాది రానుంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇప్పటివరకూ కేవలం ఒక్కటే ఆచరణలోకి వచ్చింది. దీపావళి నుంచీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకం ఆచరణలోకి వచ్చింది. ఇది తప్ప మిగతావన్నీ ఇంకా స్పష్టత లేవు. ఎప్పటినుంచి అమలు చేస్తారో కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదు. రేపోమాపో అనే ఎదురుచూపులే మిగిలాయి. లబ్ధిదారులు అందరూ వాటి కోసం ఎదురు చూస్తున్నారు. పరిస్థితి చూస్తుంటే ఈ ఐదు హామీలు ఈ ఏడాది అమలు అయ్యేలా కనిపించడం లేదు.కొత్త సంవత్సరంలోనూ ఎన్ని పథకాలు ఆచరణలోకి వస్తాయో చూడాలి. ఎన్నికల మేనిఫెస్టోపై మరోవైపు వైసిపి, వామపక్షాలు కూడా త్వరగా అమలు చేయాలని కోరుతున్నాయి. ప్రతిపక్ష వైసిపి విమర్శల దాడి కూడా చేస్తోంది. వాస్తవం కూడా ఆరు నెలల్లో ఈ హామీలను అమలు చేయకపోవడానికి కారణం ఆర్థిక సంక్షోభమే.. అధికారంలోకి రావడానికి ఇచ్చే హామీలు ఆచరణలో సాధ్యమా? లేదా? అనేది ఎన్నికల ముందు ఆలోచించరు. అధికారంలోకి వచ్చాక ఆర్థిక పరిస్థితి బాగా లేదని చెప్పడం, శ్వేతపత్రాల పేరుతో డబ్బులు లేవని కొంత కాలం కాలయాపన చేయడం.. పథకాలపై అధ్యయన కమిటీలు పేరుతో ఇంకొంత కాలం.. లబ్ధిదారుల ఎంపిక కోసం అంటూ ఇలా ఏదో పేరుతో కాలయాపనలే సాగుతున్నాయి. ఈ హామీలు ఇచ్చే ముందు ఆర్థిక పరిస్థితులు తెలియవా? అన్నదే ఆలోచించాలి. ఓట్ల కోసం ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇవ్వడం.. అమలులోకి వచ్చే సరికి వడపోతలతో లబ్ధిదారులను మోసం చేయడం వంటివే జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై అధ్యయన కమిటీ వేశారు. తెలంగాణాలో అధికారంలోకి రాగానే కాంగ్రెస్ అమలులోకి తెచ్చింది. ఇక్కడ అధ్యయన కమిటీల పేరుతో కాలయాపన తప్ప మరొకటి కాదనే విమర్శలూ వస్తున్నాయి. ఆర్టీసీకి ఇప్పటికే కోట్లాదిరూపాయల చెల్లింపులు పెండింగులో ఉన్నాయి. వాటిని ఇవ్వాలి. ఇప్పుడు మహిళలకు ఉచిత ప్రయాణం అంటే ఆదాయంలో సగం పోతోంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీల రూపంలో ఇవ్వాల్సిందే. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినందున నష్టాల్లో ఉందనే ప్రచారం ముందుకు తెస్తారు. ఇక ప్రతి మహిళకూ 18 ఏళ్ల ▶ 2లో

ఉత్త బండ్లు..ఉత్తుత్తి హెచ్చరికలు..!

- రేషన్ అక్రమాలపై పాలకులు, అధికారులందరివీ భారీ డైలాగులు..
- ఎక్కువచోట్ల బియ్యం లేకుండానే కాలనీలకు వచ్చేస్తున్న వాహనాలు
- డబ్బులిస్తామని.. బియ్యం లేవని చెబుతున్న డీలర్లు
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా చర్యలు శూన్యం

ఎండియు వాహనం (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

- 'రేషన్ బియ్యం విషయంలో అక్రమాలు జరగడానికి వీల్లేదు.. ఇటువంటి అక్రమ కార్యక్రమాలను నియంత్రించేందుకు అవసరమైతే పీడీ యాక్టును కూడా వినియోగించాలి.. నియంత్రణ బాధ్యత కలెక్టర్, ఎస్పీలదే..' ఇటీవల కలెక్టర్లు, ఎస్పీలతో జరిగిన సమావేశంలో సిఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివీ..

- రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారి వెన్నులో వణుకు పుట్టాలి. రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై కఠినంగా వ్యవహరించాలి..' ఇవీ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు..

- రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు సక్రమంగా ఇవ్వకుంటే డీలర్లపై చర్యలు తీసుకుంటాం..' ఇవీ మండల రెవెన్యూ అధికారుల హెచ్చరికలు..

పాలకుల నుంచి అధికారుల వరకు అందరూ రేషన్ బియ్యం అక్రమ రవాణా కాకుండా గట్టి చర్యలు తీసుకున్నట్లే పైకి కనపడుతోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. గత ప్రభుత్వంలో లాగానే ఈ ప్రభుత్వంలో కూడా రేషన్ బియ్యం అక్రమాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. కాకపోతే డీలర్లు మారారంతే.. ఇది పండుగల సీజన్. రేషన్ బియ్యాన్ని కార్డుదారులు ఖచ్చితంగా తీసుకుంటారు. ఇది గమనించిన డీలర్లు కొత్త ఎత్తుగడ వేశారు. బియ్యం వాహనాలు కాలనీలకు వెళ్లేటప్పుడు అక్కడి కార్డుదారులకు అనుగుణంగా బియ్యం తీసుకెళ్లాలి. కానీ అలా కాకుండా కొందరు బియ్యం తీసుకెళ్లకుండానే కాలనీలకు వెళుతున్నారు. మరికొందరు ఒక బస్తా మాత్రమే బండిలో తీసుకెళుతున్నారు. బియ్యం కోసం వచ్చిన కార్డుదారులకు బియ్యం ఎక్కువగా లేవని, డబ్బులిస్తామని చెబుతున్నారు. బియ్యం కావాల్సిందేనన్న వారికి ఐదు కేజీలకు మించి ఇవ్వడం లేదు. గట్టిగా అడిగితే 'ఐదు కేజీలు తీసుకుంటే తీసుకోండి.. లేకపోతే లేదు' అనే సమాధానమిస్తున్నారు.

సంతనూతలపాడు మండలం, పేర్నమిట్ట పరిధిలో మూడు రోజుల క్రితం ఎండియు వాహనంలో ఒకే ఒక బస్తా బియ్యం తీసుకొని డీలర్ కాలనీలకు వచ్చాడు. బియ్యం అడిగిన కార్డుదారులకు బియ్యం లేవని చెప్పారు. తప్పనిసరిగా కావాలని అడిగిన వారికి 5 కిలోలకు మించి ఇవ్వలేదు. దీనిపై స్థానికులు సంతనూతలపాడు తహశీల్దార్‌కు బండి నెంబర్‌తో సహా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన తర్వాత కూడా బియ్యం పంపిణీ సక్రమంగా జరగకపోవడం గమనార్హం.

6ఎ కేసులతో సరి.!

రేషన్ అక్రమాలు అరికట్టే కార్యక్రమంలో భాగంగా డీలర్లు, రైస్‌మిల్లులు, అక్రమ నిల్వలపై 6ఎ కేసులతో అధికారులు సరిపెడుతున్నారు. జిల్లావ్యాప్తంగా నవంబర్ నుంచి ఇప్పటివరకు 6ఎ కేసులు 45 నమోదయ్యాయి. 6ఎ కేసుల్లో జరిమానాలతో సరిపెట్టేవే ఎక్కువ. అక్రమంగా వస్తున్న ఆదాయంలో కొంతభాగం డీలర్లు జరిమానాలకు చెల్లిస్తున్నారు. మళ్లీ యథాతదంగానే అక్రమ రవాణా చేస్తున్నారు. 6ఎ కేసు నమోదయిన తర్వాత కూడా రేషన్ అక్రమ రవాణా యథాతదంగా కొనసాగడం గమనార్హం.

డీలర్ల బాధ డీలర్లది.!

రేషన్ అక్రమాలకు సంబంధించి నిందలన్నీ తమపైనే వేయడం సరికాదని డీలర్లు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒంగోలులోనూ డీలర్లను మార్చేశారు. ఎక్కువమందిని అధికారపార్టీకి చెందిన వారిని పెట్టారు. ఒక రేషన్ షాపునకు అధికారికంగా ఒక డీలర్, అనధికారికంగా మరో డీలర్‌ను ఏర్పాటుచేశారు. ఆ రేషన్ షాప్ పరిధిలో వచ్చే ఆదాయాన్ని ఈ ఇద్దరూ పంచుకోవాలి. నిబంధనల ప్రకారం రేషన్ షాపు ద్వారా ఖచ్చితంగా ▶ 2లో

క్రీడా జ్యోతి వెలిగిస్తున్న మంత్రి స్వామి

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు ప్రారంభం

8లో ▶

చిన్నారికి కేక్ తినిపిస్తున్న ఎస్పి దామోదర్

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్పీ దామోదర్ హాజరై కేక్‌ను కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, డిఎస్పీ శ్రీనివాసరావు, తాలూకా సిఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో పంట దిగుబడుల్లో వృద్ధి

భూమి లోపల వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చు ● అంతర పంటల సాగుతో అధిక ఆదాయం ● ఐసిఆర్‌పి శృతి

ప్రజాశక్తి-టంగుటూరు

శనగ పంట సాగులో విత్తనాన్ని విత్తుకునే ముందుగా బీజామృతంతో శనగ విత్తనాలను శుద్ధి చేయడం వల్ల భూమి లోపల వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చని ఐసిఆర్‌పి శృతి అన్నారు. మండలంలోని ఎం నిడమానూరు గ్రామంలో మంగళవారం ఏపీసీఎన్‌ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ వి సుభాషిణి ఆదేశాల మేరకు రైతు పొలంలో విత్తుకునే ముందుగా విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేశారు. అనంతరం శనగ పంట సాగులో అంతర పంటలుగా ఆవాలు, ధనియాలు, పొద్దు తిరుగుడు పంటలు వేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఐసిఆర్‌పి శృతి మాట్లాడుతూ పంట వేసే ముందుగా బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల భూమి నుంచి సంక్రమించే తెగుళ్లను పూర్తిగా అరికట్టవచ్చునని తద్వారా పంట ఎదుగుదలతో పాటు, అధిక దిగుబడిని సాధించవచ్చునని, అంతేకాకుండా అంతర పంటలు వేసుకోవడం పోషక పదార్థాల వినియోగ సామర్థ్యం పెంచవచ్చునని, కలుపు మొక్కలు రాకుండా నివారించడంతోపాటు పురుగు ఉధృతిని తగ్గించవచ్చునని, భూసారాన్ని పెంచవచ్చునని అన్నారు. త్వద్వారా అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన కల్పిస్తూ రైతు సోదరులందరూ కూడా అన్ని రకాల పంటలు వేసే ముందుగా బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. అంతే కాకుండా రసాయనాల బదులు మనమే ప్రకృతి ద్వారా లభించే ఆకులతో ఆవు పేడ, మూత్రంతో, ఇతర పదార్థాలతో కషాయాలు తయారు చేసుకోవచ్చని అన్నారు. పంటలో వచ్చే తెగుళ్లని బట్టి కషాయాలను తయారు చేసుకొని పంటలపై పిచికారీ చేయటం వల్ల తక్కువ ఖర్చుతో పంట అధిక దిగుబడిని సాధించవచ్చునని రైతులకు సూచించారు. బీజామృతాన్ని మనం మన ఇంటి ఆవరణంలోనే తయారు చేసుకోవచ్చని, ఇది విత్తనాలు వేసిన 12 గంటల ముందు తయారు చేసుకుంటే సరిపోతుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది ఐసిఆర్పీలు శృతి, రైతులు కాకుమాని శ్రీకాంత్, కొత్తపల్లి వెంకయ్య పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేస్తున్న రైతు కాకుమాని శ్రీకాంత్

సమస్యల వలయంలో చెరువుగూడెం గిరిజనులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని మొగుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని చెరువుగూడెం చెంచు గిరిజనులు కనీస సౌకార్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ చెరువుగూడెంలో ఆర్డీటీ వారు నిర్మించిన 12 పక్కా గృహాలతో పాటు మరో ఆరు పూరి గుడిసెల్లో కలిసి మొత్తం 25 కుటుంబాల చెంచులు నివసిస్తున్నారు. వీరి పిల్లలు చదువుకునేందుకు స్కూల్ బిల్డింగ్ లేదు. చదువుకోవాలంటే వీరంతా రేగులపల్లి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కా గృహాలు లేకపోవడంతో వర్షానికి, ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి సౌకర్యం సరిగా లేదు. మంచినీటి కోసం సైతం అవస్థలు పడుతున్నామని విటిడిఏ ప్రెసిడెంట్ జల్లా బయన్న తెలిపారు. ఉపాధి పనులు లేక అవస్థలు పడుతున్నామని జల్లా ఈదన్న చెప్పాడు. పక్క గ్రామాల్లో పొలం పనులకు వెళుతూ కుటుంబాలను పోషించుకుంటున్నామని కుడుముల పోలమ్మ తెలిపింది. కనీసం మినీ అంగన్‌వాడీ సెంటర్ కూడా లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు మొగుళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోందని కుడుముల చిన్నయ్య తెలిపాడు. పక్కా గృహాలు, సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యం, ఉపాధి పనులు కల్పించి చెరువుగూడెం చెంచు గిరిజనులను ఆదుకోవాలని జిల్లా చెంచుల సంఘం అధ్యక్షుడు భూమని వెంకటేశం ప్రభుత్వాన్ని కోరారు.

సమస్యలు తెలుపుతున్న చెంచులు

చెంచుల గృహాలు

'ఉత్త' బండ్లు..'ఉత్తుత్తి' హెచ్చరికలు.!

(మొదటిపేజీ తరువాయి)

అందరికీ బియ్యం పంపిణీ చేస్తే వచ్చే కమిషన్ సుమారు రూ.10 వేలు మాత్రమే.. ఇందులోనే షాపు అద్దెలు కట్టు కోవాల్సి ఉంది. రూ.పది వేలు కూడా రాని ఆదాయానికి కూటమి పాలకులు ఇద్ద రిని ఎందుకు కేటాయిస్తారు.? అక్రమంగా ఆదాయం వస్తుండటం వల్లే ఒక షాపు నకు ఇద్దరిని కేటాయించారన్న విషయం తెలిసిందే.. దీనికి తోడు డీలర్లకు గతం కంటే ఆదాయం తగ్గింది. గతంలో మిల్లులకు వాళ్ళ అమ్మే బియ్యానికి కిలోకి రూ.20 పైనే ఇచ్చేవాళ్లు. కానీ ప్రస్తుతం మిల్లుల వాళ్ళ తాము ఇవ్వాల్సిన వాళ్లకి ఇవ్వాలనే పేరుతో బియ్యం కిలోకి రూ.16 మాత్రమే డీలర్లకు ఇస్తున్నారు. గతం లో వచ్చే ధర కన్నా తగ్గిపోవడం, దీనికి తోడు ఇద్దరు పంచుకోవడం వల్ల.. తమ కు పెద్దగా ఆదాయం రావట్లేదని డీలర్లు ఆవేదన చెందుతుండటం గమనార్హం.

ఈ ఏడాదికి ఆ ఐదు హామీలూ లేనట్లేనా.?

(మొదటిపేజీ తరువాయి)

దాటితే నెలకు రూ.1500 ఇస్తామన్నారు. వీటికోసం ఇపుడు మహిళలందరూ ఎదురుచూస్తున్నారు. ఓటేసిన ప్రతి మహిళా ఈ పథకానికి అర్హురాలే.. ఎన్ని కోట్లు అవసరమనేదీ తేల్చాలి. తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు, నిరుద్యోగులకు భృతి ఎన్నికల మేనిఫెస్టోలోఉన్నాయి. ఇవేవీ ఆచరణలోకి రాలేదు. నెలకు రెండు సార్లు కేబినెట్ జరిగినా వీటిపై చర్చ లేదు. వీటిని అమలు చేయాలనే ఆలోచన కూడా రావడం లేదు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపైనే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎన్నికల్లోనే ఈ హామీలు ప్రాధాన్యతగా ఉన్నాయి. అధికారం వచ్చాక వాటిపై అంత శ్రద్ధ పెట్టడం లేదనే చర్చ ఉంది. జగన్ ఎక్కడా లేనంతగా సంక్షేమ పథకాలు అమలు చేసినా ఓట్లు వేయలేదనే భావన కూడా తెలుగుదేశం నేతల్లో ఉంది. అందుకే ఇప్పుడు జాప్యం చేస్తున్నారా? అనేదీ చర్చగా మారింది. ఏదేమైనా సంక్షేమ ఎజెండా నిదానంగానే ఉంది.

చెంచు కాలనీల్లో దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని యల్లారెడ్డిపల్లి, గౌతమ బుద్ధుని చెంచు కాలనీల్లో ఆదివారం జీసస్ వే ఆఫ్ గాస్పెల్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెంచు కాలనీలోని 15 కుటుంబాలకు ఆ సొసైటీ పరిచారకుడు మునగాల శీను చేతుల మీదగా వారికి దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా శీను మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు ప్రేమను కలిగి ఉండాలని, ఆయన మార్గంలో ప్రయాణించాలని కోరారు. రానున్న క్రిస్మస్ పండగ సందర్భంగా తమ సొసైటీ తరపున ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసస్ వే ఆఫ్ గాస్పెల్ పరిచారకులు బత్తుల జకర్యా, బత్తుల వెంకటేష్, మునగాల హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు దుప్పట్లు పంపిణీ చేసిన పరిచారకులు

తడిసిన మిర్చి

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండంలో శనివారం రాత్రి అకాల వర్షం కురిసింది. దీంతో మండలంలోని గొబ్బూరు గ్రామానికి చెందిన బోదనపు పెద్దిరెడ్డి మూడు ఎకరాల్లో సాగు చేసి ఆరబెట్టుకున్న మిర్చి తడిసిపోయింది. రైతులు కష్టనష్టాలకోర్చి పండించి చేతికొచ్చిందనుకున్న పంట కళ్లముందే వర్షపు నీటిలో తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటకు లక్షలాది రూపాయలు వెచ్చింది చీడపీడ, తెగుళ్ల నుంచి రక్షించుకొని ఇంటికి చేర్చే సమయంలో అకాల వర్షం వల్ల మిర్చి తడిసిందని ఆందోళన చెందుతున్నారు. ఈ మిర్చి తెల్లకాయలు అవుతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు నష్టపరిహారం చెల్లించాలని వారు కోరుతున్నారు.

వర్షానికి తడిసిన మిర్చి

ప్రతి ఇంటికీ తాగునీరు ఎప్పుడో?

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చెరిసగం నిధులతో ఈ పనులను జిల్లాలో చేపట్టారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నిధుల విడుదల జరగని కారణంగా 1,420 పనుల్లో 432 పనులు మాత్రమే మొదలుపెట్టారు. ఇందులో 333 పనుల్లో కొన్ని పూర్తి కాగా మరి కొన్ని వివిధ దశల్లో ఉండిపోయాయి. దీంతో మంజూరు అయిన వాటిలో 988 పనులు గడిచిన కాలం గా నిలిచిపోయాయి. జిల్లాలో ఇప్పటివరకు 1.48 లక్షల గహాలకు మంచినీటి కొళాయిలు ఉండగా, మిగిలిన 2.16 లక్షల గహాలకు మంచినీటి కొళాయిలు ఇవ్వాల్సి ఉంది. నాలుగేళ్ల క్రితం జలజీవన్ మిషన్ ద్వారా జిల్లాలో పనులు ప్రారంభించిన సమయంలో ప్రతి ఇంటికీ తలసరిన రోజుకు కుళాయిల ద్వారా 40 లీటర్ల నీటి సరఫరా లక్ష్యంగా పనులు చేపట్టడం జరిగింది. కానీ ఇటీవల కేంద్రప్రభుత్వం కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ 55 లీటర్ల చొప్పున తాగునీరు సరఫరా జరగాలని నిర్దేశించిన నేపథ్యంలో ఇందుకు తగిన విధంగా ఇప్పటి వరకు చేపట్టిన ప్రాజెక్టు పనుల్లో మార్పులు చేశారు. ఇందుకు రూ.172 కోట్ల నిధులు అదనంగా అవసరం అవుతాయని అధికారులు లెక్కలు తేల్చారు. ఈ మేరకు సవరించిన నివేదికను ప్రభుత్వానికి పంపారు. ప్రస్తుతం ప్రతి ఇంటికీ 55 లీటర్ల తాగునీరు అందించేలా జలజీవన్ మిషన్ కింద జిల్లాకు మంజూరైన పనులలో నిలిచిపోయిన 988 చేపట్టడానికి తిరిగి ప్రభుత్వ అనుమతి పొందాల్సి ఉంది. ఇందుకు రూ.587 కోట్ల నిధులు అవసరం. ఈ పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం నుంచి తిరిగి అనుమతి రావాల్సి ఉంది. అలానే జిల్లాలో 960 అవాస ప్రాంతాలుండగా అందులో 369 పిడబ్ల్యూఎస్ పథకాలు, 25 సిపిడబ్ల్యూఎస్ పథకాలు, 5,083 చేతి పంపులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పథకాల నిర్వహణ, మరమ్మతులకు మరో రూ 6.9 కోట్లు నిధులు అవసరం ఉంది. వీటితో పాటు చీరాల, వేటపాలెం మండలాలలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.160 కోట్ల నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా పనులు తిరిగి ప్రారంభం కావాలంటే కేంద్రం వాటా పోను రాష్ట ప్రభుత్వం రూ.350 కోట్ల నిధులు అయినా మంజూరు చేయాల్సిఉంది. కొత్త ప్రాజెక్టు పనుల కోసం రూ.80 కోట్లు కావాలి. కానీ ప్రస్తుతం రాష్టప్రభుత్వం నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కొంతమేర నిధులు అయినా మంజూరు చేయగలుగుతుందా అనేది సందేహమే.. ఈ కారణంగా జిల్లాలో మంచినీటి సరఫరా పథకాల పనులు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు.

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో రూ 587.55 కోట్ల విలువైన 1420 పనులు మంజూరయ్యాయి. ఇందులో 432 పనులు చేపట్టారు. రూ 53.81 కోట్ల విలువైన 333 పనుల్లో కొన్ని పూర్తి కాగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. 988 పనులు అసలు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ పనులు చేపట్టేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతులు ఇవ్వాల్సి ఉంది.

నిధుల కోసం నివేదిక పంపాం..

జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

జిల్లాలో నిలిచిపోయిన జలజీవన్ మిషన్ పనులను తిరిగి చేపట్టేందుకు తగిన కసరత్తు జరిపాం. ఎంతమేర నిధులు అవసరం అవుతాయన్న విషయమై అంచనాలతో కూడిన నివేదికను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాం.. జిల్లాలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి మరిన్ని నిధులు కావాల్సి ఉంది. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న జలజీవన్ మిషన్ పనులను త్వరితంగా పూర్తి చేసి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తాం.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

గణిత దినోత్సవం సందర్భంగా ఆదివారం సంతనూతలపాడు హైస్కూల్లో విద్యార్థులకు గణిత ముగ్గులు, వ్యాసరచన, ఎలక్యూషన్ తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు వజ్రాల మాధవీలత, కెవిఎస్ఎస్ రజిని, ఎంవిఎన్ జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

తమ్ముడు కావాలని రోదిస్తున్న జెస్సీ

దుస్తులు కొనడానికి వెళ్లి..

మృత్యుఒడిలోకి..

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

అక్కడిక్కడే విద్యార్థి మృతి

తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చీరాల

క్రిస్మస్ పండగకు దుస్తులు కొనడానికి ద్విచక్ర వాహనంపై బాపట్ల నుంచి చీరాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతున్న ఆ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురికావటంతో ఆ ఇంటిలో విషాదం నెలకొంది. ఈ ప్రమాదంలో విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా తల్లిదండ్రులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం చీరాల రైల్వే ఓవర్ బ్రిడ్జి పైన చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. బాపట్లలోని ఆనందపేటలో నివాసం ఉంటున్న ప్రవీణ్, దివ్య దంపతులు, చిన్న కుమారుడు రాహుల్ (10), కుమార్తె జెస్సితో కలసి క్రిస్మస్ పండగకు దుస్తులు, సామాగ్రి కొనుగోలు చేసేందుకు చీరాల షాపింగుకు వచ్చారు. షాపింగ్ అనంతరం తిరిగి బాపట్లకు ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళ్లేందుకు రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణం సాగిస్తున్నారు. బ్రిడ్జి ఎక్కి కారంచేడు గేటు సెంటర్ వైపు దిగుతుండగా గేటు సెంటర్ నుంచి బస్టాండ్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు టైరు బాలుడు పైకి ఎక్కటంతో టైర్ల క్రింద పడి నలిగిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమా దంలో దంపతులు ప్రవీణ్ కుమార్, దివ్యలకు సైతం తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. భర్త ప్రవీ ణ్‌ను మెరుగైన వైద్యం కోసం చీరాలలోని ఓ ప్రైవేట్ వైద్య శాలకు తరలించారు. ఈ ఘట నపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరగటంతో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్ సమస్య తలె త్తింది. ఎక్కడికక్కడే పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. అయితే మృతి చెందిన బాలుడు అక్క జెస్సి తన తమ్ముడు కావాలి అంటూ బంధువులను పట్టుకొని రోదిస్తున్న తీరు, మరో ప్రక్క తన కుమారుడు ఎలా ఉన్నాడు అని ఆ తల్లిదండ్రులు అందరినీ ఆర్తనాదాలతో అడగటం చూపురులను కంట తడి పెట్టించింది.

హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తల్లి దివ్య

ప్రవీణ్‌కుమార్(ఫైల్)

నుజ్జునుజ్జయిన వాహనం

టూరిస్టు బస్సును ఢీకొన్న కారు

మహిళ మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శ్రీశైలం వెళ్లే రహదారిలో మల్లికార్జున నగర్ షాల్‌పేర్ హోటల్ వద్ద ఆదివారం వేకువజామున నాలుగు గంటల సమయంలో మధ్యప్రదేశ్ నుంచి శ్రీశైలం వెళ్తున్న టూరిస్టు వాహనాన్ని కర్నూలు నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు వేగంగా టూరిస్టు బస్సును వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. క్రిస్మస్ పండుగ నిమిత్తం కర్నూలులో నూతన దుస్తులు కొనుగోలు చేసి శ్రీశైలం వెళ్లే క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో వంకె మల్లిక(28) మృతి చెందగా భర్త మురహరి బాబురావుకు, కుమార్తె జోషికకు స్వల్ప గాయాలయ్యాయి. మృతి చెందిన వంకె మల్లిక మృతదేహాన్ని పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతిచెందిన మల్లిక శ్రీశైలంలోని వైద్యశాలలో నర్సుగా పని చేస్తున్నారు. పెద్దదోర్నాల ఎస్ఐ మహేష్ సెలవులో ఉండడంతో పెద్దారవీడు ఎస్ఐ అనిల్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన మల్లిక

టీడీపీ సీనియర్ నాయకుడు అంకమ్మ మృతి

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు మండలంలోని భోగనంపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వెలుగు అంకమ్మ (80) శనివారం మృతి చెందాడు. ఈయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మండలంలో ఒక ముఖ్య నాయకుడిని కోల్పోయామని మండల టిడిపి పార్టీ అధ్యక్షులు అనుముల సాంబశివరావు అన్నారు. భోగనంపాడు గ్రామంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అంకమ్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - చీరాల

రమేష్ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం గడియార స్తంభం సెంటర్‌లోని స్థానిక రమేష్ డయాగ్నొస్టిక్స్ ల్యాబ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు మరియు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చీరాల ఐఎంఎ జోనల్ చైర్మన్ డాక్టర్ భవానీ ప్రసాద్, డాక్టర్ ప్రదీప్ మరియు ల్యాబ్ అండ్ ఎక్స్‌రే ప్రెసిడెంట్ శివరాం ప్రసాద్, రమేష్ డయాగ్నస్టిక్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పాస్టర్ జోసఫ్ ప్రత్యేక ప్రార్థన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ హాస్పిటల్ ఎండి డాక్టర్ పి.శ్రీకాంత్, డాక్టర్ తాడివలస దేవరాజు పలువురు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం

ప్రజాశక్తి-దర్శి

నడకతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఝాన్సీ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి.కోటిరెడ్డి, డాక్టర్ జాన్సీలు అన్నారు. దర్శిలోని పాఠశాల విద్యార్థులు ఆదివారం దర్శి నుంచి మండలంలోని రాజంపల్లి వరకు నడిచి వెళ్లారు. ఈ సందర్భంగా ఝాన్సీ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి.కోటిరెడ్డి, డాక్టర్ జాన్సీలు మాట్లడుతూ ఆరోగ్యానికి నడకెంతో మేలు అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో విఓఏలుగా పనిచేస్తున్న నూరుబాష నాగూరమ్మ, రాచూరి మాధవిలు తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో వై.మహలక్ష్మిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగూరమ్మ తిమ్మసముద్రం గ్రామైఖ్య సంఘం, మాధవి శ్రీషిరిడి సాయిబాబా గ్రామైఖ్య సంఘంలో గత కొన్ని సంవత్సరాలుగా విఓఏలుగా పనిచేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ కారణాలతో మమ్ములను తొలగించారని, దీంతో మా జీవనాధారం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక హైకోర్టును ఆశ్రయించి రిట్ పిటిషన్ వేసామన్నారు. తిరిగి విధుల్లోకి చేరాలని కోర్టు తీర్పునిచ్చిందన్నారు. తదుపరి గ్రీవెన్స్‌లో జిల్లాకలెక్టరును కలవగా వారు కూడా తిరిగి విదుల్లోకి చేరాలని తెలిపారన్నారు. కానీ ఏపీఎం మమ్ములను విధుల్లోకి చేర్చుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని కోరారు. గ్రామైఖ్య సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయగా సంఘ సభ్యులందరూ మమ్ములను వీవోఏలుగా ఏకగ్రీవంగా ఎన్నకున్నారన్నారని, కానీ ఏపీఎం మా సమస్య పరిష్కరించడం లేదన్నారు. ఇప్పటికైన మా సమస్యను పరిష్కరించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్, విఓఏలు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

వాహనదారులుతో మాట్లాడుతున్న పోలీసులు

హెల్మెట్‌తో రక్షణ

ప్రజాశక్తి -రాచర్ల

రాచర్లలో గిద్దలూరు రూరల్ సిఐ జె.రామకోటయ్య ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించటంపై ర్యాలీ, అవగాహన నిర్వహించారు. ప్రతి ద్విచక్రవాహనదారు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయటం, అతివేగంగా డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయన్నారు. హెల్మెట్ ధరించకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానాతో పాటు మూడు నెలల పాటు లైసెన్స్ రద్దు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు, వాహనదారులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: హెల్మెట్ ఒక ప్రాణాన్ని కాపాడటమే కాకుండా ఒక కుటుంబాన్ని రోడ్డు మీద పడకుండా చేస్తుందని ఎస్ఐ బి.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వాహనదారులకు హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. తద్వారా తనతో పాటు వారి కుటుంబాన్ని రోడ్డున పడకుండా కాపాడుకోవచ్చున్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపటం వలన ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఉత్కంఠగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎన్నిక

అధ్యక్షుడిగా ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శిగా నాగేశ్వరరావు

శ్రీనివాసరావు

నాగేశ్వరరావు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా ముప్పలనేని శ్రీనివాసరావు తిరిగి రెండోసారి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా మనం నాగేశ్వరరావు మళ్లీ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ పాలకవర్గం ఎన్నిక ఉత్కంఠ భరితంగా జరిగింది. 2025–27 రెండేళ్లపాటు కొనసాగే పాలకవర్గం ఎన్నికల తీర్పులో వినూత్న మార్పు చోటుచేసుకుంది. పాలకవర్గానికి సొసైటీ సభ్యులు ఇంచుమించు సమానమైన తీర్పు ఇచ్చారు. రెండోసారి అధ్యక్షుడిగా పోటీ చేసిన ముప్పలనేని శ్రీనివాసరావు 10 ఓట్ల మెజార్టీతో బయటపడగలిగారు. తొలిసారి పోటీ చేసిన ఎన్నికల్లో ఆయనకు 31 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఆ సంఖ్య ఇప్పుడు పదికి పడిపోయింది. సుదీర్ఘకాలంగా సొసైటీ పాలకవర్గంలో కొనసాగుతున్న మానం నాగేశ్వరరావు గత ఎన్నికల్లో 48 ఓట్ల మెజార్టీతో కార్యదర్శిగా విజయం సాధిస్తే, ఈసారి 21 ఓట్ల మెజార్టీ మాత్రమే దక్కింది. మెజార్టీ తగ్గినా మనం నాగేశ్వరరావు తమ పట్టును మాత్రం నిలుపుకుంటూ వస్తున్నారు. సొసైటీ సంయుక్త కార్యదర్శిగా పోటీ చేసిన దొడ్డపనేని వెంకయ్య చౌదరి మూడు ఓట్లతో గెలుపొందారు. గత ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో ఓడిపోయిన ఆయన ఈసారి మూడు ఓట్ల మెజార్టీతో గట్టెక్కారు. ఉపాధ్యక్షుడు–2 పదవికి పోటీ చేసిన పారేపల్లి చంద్రశేఖర్ 8 ఓట్లతో గెలిచారు. ఒకటోవ ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన కొల్లా వీరయ్య చౌదరి, కారుమంచి వెంకట్రావుకు ఇద్దరికీ సమానంగా 69 ఓట్లు వచ్చాయి. దీనిపై తిరిగి రీకౌంటింగ్ నిర్వహించారు. అందులోనూ 69 ఓట్లే వచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో ఇద్దరికీ చేరోసగం పదవీకాలం దక్కే అవకాశం ఉంది. దీనిపై ఎన్నికల అధికారి స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

సొసైటీ కోశాధికారిగా కోట వీర బ్రహ్మయ్య రెండు ఓట్లతో గట్టెక్కారు. గత ఎన్నికల్లో ఒక్క ఓటుతో ఓడిపోయిన ఆయన ఈసారి రెండు ఓట్లతో గెలిచారు. మొత్తం మీద ముప్పలనేని శ్రీనివాసరావు ప్యానల్‌కు కీలకమైన కోశాధికారి పదవి కోల్పోవడం మింగుడు పడని వ్యవహారమే. ఒకరికి సమాన ఓట్లు వస్తే, పాలకవర్గంలోని మరికొందరు అతి స్వల్ప మెజార్టీతో బయటపడ్డారు. ఎన్నికల ఫలితాల తీరు చూస్తుంటే సొసైటీలోని పాలకవర్గానికి సభ్యులు ఇచ్చిన తీర్పు సమాన స్థాయిలో కనిపిస్తోంది.

జీవో 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-బాపట్ల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యక్రమంలో జరిగిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సుకు ప్రభాకర్ అధ్యక్షత వహించారు. సదస్సులో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పురపాలక సంఘాల్లో కీలకమైన విభాగంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. 2011 వరకు పారిశుద్ధ్య కార్మికులతో పాటు వీరికి వేతనాలు పెరిగాయని, ఇప్పుడు ఇంజనీరింగ్ కార్మికులకు ప్రత్యేకమైన వేతనాలు ఇస్తున్నారన్నారు. వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ, పార్కులు, అండర్ గ్రౌండ్, తదితర విభాగాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు ఐటిఐ, డిగ్రీలు చదువుకొని పనిచేస్తున్నారని, వీరికి అనేకచోట్ల రూ.12,000 నుంచి రూ.15,000 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. గత ఏడాది జరిగిన మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో జరిగిన చర్చల ఒప్పందం ప్రకారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఆందోళన సిద్ధమవుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా గత ఏడాది చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని ఈనెల 26న మున్సిపల్ కేంద్రాల్లో రిలే నిరాహార దీక్ష జరపాలని అన్నారు. అప్పటికీ పరిష్కారం కాని పక్షంలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపు ఇస్తామన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ ఐక్య పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.

జిల్లా నూతన కమిటీ

జిల్లా నూతన కమిటీ కన్వీనర్‌గా సిహెచ్ వీరస్వామి, రత్నం (బాపట్ల) వెంకటసుబ్బారావు (బాపట్ల), యు.శామ్యూల్ (అద్దంకి), మారుతి (అద్దంకి), ప్రభాకర్ (రేపల్లె), శివాజీ (రేపల్లె), జి.నాగేశ్వరరావు (చీరాల), చాంద్ బాషా (చీరాల)లను ఎన్నుకున్నారు. సదస్సులో సిఐటియు నాయకులు కె.శరత్ శామ్యూల్ బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె మున్సిపాలిటీ నుంచి ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు భరోసా

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసా ఇస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు అంటేనే పేద కుటుంబాలకు భద్రత, భరోసా అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందిన 41 మందికి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని పేరు పేరునా ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పేద ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు కొండంత అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సీఎంఆర్ఎఫ్‌ను తిరిగి ప్రారంభించారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పేదలకు ఆర్థిక భరోసా కరువైందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేలా చర్యలు చేపట్టారని ఏలూరి పేర్కొన్నారు. అత్యవసర సమయంలో కార్పొరేట్ వైద్యశాలల్లో శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఆర్థికంగా సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ అందించిన దాఖలాలు లేవన్నారు. ఐదు నెలల కాలంలోనే రెండు కోట్లకు పైగా పేదలకు ఆర్థిక భరోసా అందించామన్నారు. పేదల ఆరోగ్య విషయంలో కూటమి ప్రభుత్వం కొండంత భరోసాగా నిలుస్తుందన్నారు.

చిమ్మిరిబండకి చెందిన దుడ్డు పెద్ద పుల్లారావుకు రూ.91,350, జొన్నతాళి చెందిన శివరాత్రి విశ్వనాథకు రూ.52,863, అడుసుమల్లికి చెందిన కొంగర వెంకాయమ్మ రూ.57,700, షేక్ హుస్సేన్ సాహెబ్ రూ.80,500, ఒట్ల వెంకట సుబ్బారావు రూ.55,280, వలపర్లకి చెందిన గోలి కుమారస్వామి రూ.100,000, జక్క శివ కోటేశ్వరరావు రూ.1,09,615, షేక్ మొహిద్దీన్ బి రూ.45,970, గంగవరంకి చెందిన కర్రి చంద్రశేఖర్ రూ.5 లక్షలు, కొనికి చెందిన పి.నరసింహారావు 79,125, వీరన్నపాలెంకి చెందిన గుజ్జర్లపూడి రేవతి రూ.44,156, వంకాయల పాడుకు చెందిన యామర్తి స్టీఫెన్ రూ.2 లక్షలు, పూసపాడుకు చెందిన మద్దిరాల మహేష్‌కు రూ.49,677, కడవకుదురుకు చెందిన వెంకట సుబ్బారావుకు రూ.2,50,000, ఇసుక దర్శికు చెందినషేక్ ముంతాజ్ బేగంకు రూ.98,100, షేక్ మస్తాన్ బి రూ.1,02,658, కోలలపూడికి చెందిన మారుతీ ధర్మ తేజ రూ.59,450, తిమ్మరాజుపాలెంకి చెందిన మిరియాల సుబ్బయమ్మ రూ.50,160, ఇడుపులపాడుకి చెందిన గోరంట్ల శ్రీదేవి రూ.99,900, గోరంట్ల పద్మావతి రూ.100,00, అడిపుడికి చెందిన మాదల పద్మావతి రూ.3 లక్షలు, కారంచేడుకు చెందిన సువర్ణ కుమారి రూ.1,37,450, జరుబులవారిపాలెంకి చెందిన జెర్రిపోతుల శ్యామిలీ రూ.58,110, నాదెండ్ల లక్ష్మి రూ.53,324, మార్టూరుకు చెందిన మందపాటి అంజయ్య రూ.65,250, షేక్ బుడే రూ.136,103,షేక్ చేరుకూరి సుభాని రూ.47,900, రాజు బంగారు పాలెంకి చెందిన సూరిని వెంకట దీపిక రూ.97,503, మున్నంగి వారిపాలెంకి చెందిన చెరుకూరి హరితలయమ్మ రూ.58,000, చింతపల్లి పాడుకు చెందిన జంపని పెద్దబ్బాయి రూ.1,44,200, కటారివారి పాలెంకి చెందిన ఎలగల నాగమ్మ రూ.25,145, నాగండ్లకి చెందిన పేర్ని నాగేశ్వరరావు రూ.2 లక్షలు, భీమవరంకి చెందిన సోమల పద్మ రూ.20,000, పెద్ద గొల్లపాలెంకి చెందిన వడ్లమూడి హైమావతి రూ.31,377, కోనంకి చెందిన తాళ్లూరి అహల్య రూ.35,688, ఉప్పలపాటి నరసయ్య రూ.37,551, వెంకటప్పయ్య రూ.30,166, నాగరాజుపల్లికి చెందిన సిహెచ్ లక్ష్మీనారాయణ రూ.23,400, దుద్దుకూరుకి చెందిన మువ్వ రామ సుబ్బులు రూ.57,260 లకు ఎమ్మెల్యే ఏలూరి చెక్కులను అందజేశారు.

'డాక్టర్ కాసల'కు విశిష్ట సాహితీ పురస్కారం

ప్రజాశక్తి-అద్దంకి

కాసల నాగభూషణంకు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

ప్రముఖ కవి డాక్టర్ కాసల నాగభూషణంకు పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల విశిష్ట సాహితీ పురస్కారం అందజేశారు. ఇందిరానగర్‌లోని పుట్టంరాజు కళాక్షేత్రంలో జరిగిన సభకు సాహితీ కౌముది అధ్యక్షుడు మరియు ట్రస్ట్ అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షత వహించారు. పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల విశిష్ట సాహితీ పురస్కారాన్ని పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, శైలజలు డా.కాసలకు అందించారు. ఈ సందర్భంగా పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పద్యం, గేయం, వచన వంటి విభిన్న ప్రక్రియల్లో సాధికారికమైన పట్టు కలిగిన కవి డా.కాసల వారని, ఆముక్త మాల్యదకు వారు చేసిన సరళవచనానువాదం ప్రసిద్ధమైనదన్నారు. అనేక పత్రికలలో వీరి కవితలు, కథలు, వ్యాసాలు ప్రచురితమయ్యాయన్నారు. కృష్ణదేవరాయలు రాసిన ఆముక్తమాల్యద ఒక ప్రౌఢకావ్యమని, ఈ కావ్యాన్ని సులభశైలిలో సరళ వచనానువాదం చేసి డా.కాసల తెలుగు భాషకు గొప్ప సేవ చేశారని పద్యకవి డి.వి.యం.సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో చప్పిడి వీరయ్య, డా.యు.దేవపాలన, గాడేపల్లి దివాకర దత్తు, అడుసుమల్లి అనంత కోటేశ్వర రావు, ధేనువకొండ సుబ్బయ్య, షేక్ మస్తాన్, ఇలపావులూరి శాయి, నారాయణం బాల సుబ్రహ్మణ్యం, వామరాజు వెంకటేశ్వరరావు, జె.ప్రతాప్, పాపారావు, గాడేపల్లి దివాకర దత్తు, డా.యు. దేవపాలన, చప్పిడి వీరయ్య, కుందా సుబ్బారావు, మిద్దెబోయిన ఆంజనేయరాజు, అద్దంకి నాగేశ్వర రావు, ఒరుగంటి శ్రీనివాసరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, నిమ్మరాజు నాగేశ్వర రావు, లక్కరాజు శ్రీనివాసరావు, కందికంటి సత్యనారాయణ, రాజకుమార్, కొండకావూరి కుమార్, పి.సి.హెచ్. కోటయ్య, అన్నమనేని వెంకటరావు, కంభంపాటి రామమోహనరావు, మాదిరాజు శ్రీరామమూర్తి, ఆర్.వి.రాఘవరావు, సంకాబాబు, బత్తుల అంజయ్య, బాలు, మహమ్మద్ రఫీ, అంగలకుర్తి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్ అందజేస్తున్న దృశ్యం

సుబ్బారావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-వేటపాలెం

మండలంలోని పందిళ్లపల్లికి చెందిన పమిడాల సుబ్బారావు పేద ప్రజలకు చేస్తున్న వైద్య సేవలు అభినందనీయమని టీడీపీ నాయకుడు టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం ఆయన సేవలకు గుర్తింపుగా ఉచితంగా మెడికల్ సామాన్లు అందజేశారు. టిడిపి వేటపాలెం మండల జనరల్ సెక్రెటరీ పల్లపోలు బుల్లబ్బాయి కుమారుడు శ్రీనివాసరావు, గోవన సుబ్బారావు కుమారుడు నాగరాజు, చెరుకూరి బసవయ్య కుమారుడు రాంబాబు ఆర్థిక సాయంతో రూ.10 వేలు రూపాయలు విలువైన కట్టుకు సంబంధించిన మెడికల్ కిట్లు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చుట్టు ప్రక్కల నాలుగు మండలాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. పేదరికంతో ఇబ్బంది పడుతూ వైద్యం చేయించుకోలేని వారికి ఇలాంటి సేవల అందించడంలో సుబ్బారావుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోటుపల్లి సర్పంచ్ సాంబయ్య, టిడిపి నాయకులు ఏరాసు భసవేశ్వరరావు, పి.నాగార్జున, ప్రముఖులు సత్యనారాయణ, కృష్ణ, ప్రసన్న, సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-మేదరమెట్ల

చరణ్‌తేజ

అభిరామ్

మౌనిక

మండలంలోని రావినూతల గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం ప్రోత్సాహక పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలలో ఐదు మండలాలకు సంబంధించి 33 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న సుమారు 400 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. వీరిని ఓసి, బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలుగా విభజించి ప్రతి కేటగిరీలో మూడు బహుమతులు ప్రకటించునున్నారు. మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు చొప్పున 9 మంది విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. ప్రతి పాఠశాలల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు రూ.3వేలు చొప్పున అదనపు బహుమతి ఇవ్వనున్నారు. ఈ బహుమతులు అన్నీ యలగాల సుబ్బారావు కుమారుడు అయిన డాక్టర్ యలగాల గోపిచంద్ అందజేశారు. ఓసీ కేటగిరీలో కొప్పెరపాడు జిల్లా పరిషత్‌కు చెందిన విద్యార్థి నాగసాయి చరణ్ తేజ, బీసీ కేటగిరీలో కుప్పరపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు సంబంధించిన అభిరామ్, ఎస్సీ కేటగిరీలో పావులూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి వి.మౌనిక మొదటి బహుమతులను గెలుచుకోవడం జరిగింది. డాక్టర్ గోపీచంద్ మాట్లాడుతూ విద్యను ప్రోత్సహించటం కోసమే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

ప్రజాశక్తి అద్దంకి విలేకరి అల్లంనేని శ్రీనివాసరావు, శ్రీదేవిల కుమారుడు ప్రణీత్, ప్రశాంతిల వివాహ వేడుక అద్దంకిలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రజాశక్తి జీఎం ఎం.ఎల్.ప్రసాద్‌రావు, ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్‌వి బ్రహ్మం నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ప్రజాశక్తి-అద్దంకి

కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఉమాపతిచౌదరి, డాక్టర్ కిరణ్మయిచౌదరి

'సాయిశషిని'లో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని సుందరయ్యభవన్ రోడ్డులో ఉన్న సాయిశషిని మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ ఉమాపతిచౌదరి, గైనకాలజిస్ట్ డాక్టర్ కిరణ్మయిచౌదరి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ మణికిషోర్, ఇతర వైద్యులు, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

24, 25 తేదీలలో ఒంగోలు ఎంపీ పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈనెల 24 ,25 తేదీల్లో పలు కార్యక్రమంలో పాల్గొననున్నారు. 24వ తేదీ ఉదయం కార్యాలయంలో ప్రజలకు మాగుంట కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. ఉదయం 10:30 గంటలకు ప్రకాశం భవనంలోని కలెక్టర్ కార్యాలయంలో నేషనల్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్ అధికారులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాత్రి 8:30 గంటలకు ఒంగోలులో జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో జరిగే క్రిస్మస్ కాండిల్ సర్వీస్ కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 9 గంటలకు. ఒంగోలు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఈనెల 25వ తేదీ ఉదయం 8 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 9 గంటలకు. టంగుటూరులో కీర్తిశేషులు పోతుల చెంచయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు.

పివిరావు వర్ధంతి కార్యక్రమంలో నీలం నాగేంద్రరావు

పివి రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పివి.రావు 19వ వర్ధంతి సంస్మరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఈ సందర్భంగా పివి రావుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు ప్రధాన కార్యదర్శి కాకుమాను రవి, దళిత నాయకులు దేవరపల్లి రమణయ్య, పోతురాజు, కసుకుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

కోడిగుడ్డు రూ.7.!

సామాన్యులకు భారమైన పోషకాహారం

ప్రజాశక్తి-మార్కాపురం

సామాన్యులకు పోషకాహారం భారమైంది. కోడిగుడ్డు ధర రూ.7లకు చేరింది. పోషకాహారంగా పిలుచుకునే కోడిగుడ్డు ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం కోడిగుడ్డు వినియోగం పెరిగింది. ఫలితంగా ప్రతి నెలా కోడిగుడ్ల ధరల్లో పెరుగుదల కనిపిస్తోంది. గత ఐదు నెలలుగా గుడ్డు ధరలు పరిశీలిస్తే.. పెరుగుదల నిజమనిపిస్తోంది. 2024లో సార్వత్రిక ఎన్నికల ముందు కోడిగుడ్ల అట్ట ఒకటి రూ.150 వరకు ధర పలికింది. అట్టలో 30 గుడ్లు ఉంటాయి. ఈ లెక్కన ఒక్కో గుడ్డు ధర రూ.5 ఉండేది. అది ప్రస్తుతం రూ.200కు చేరంది. ఈ ధరలు మరింత ఎగబాకే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. ఇప్పుడే ఈ ధరలు ఇలా ఉంటే రాబోయే క్రిస్మస్, నూతన సంవత్సరంలో మరింత పెరిగే అవకాశం కనపడుతోంది. దీనికి కారణం ఈ పండగల్లో కేకు తయారీలు అధికంగా ఉంటాయి. వీటి తయారీలో తప్పనిసరిగా కోడిగుడ్లు వినియోగించనున్నారు. మార్కెట్‌లో నెక్ మార్కెట్ (నేషనల్ ఎగ్–కోఆర్డినేటర్ కమిటీ) ఎగ్ ధర రూ.6.40 ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ. 0.60 పైసలు అదనంగా విక్రయిస్తున్నారు. దీంతో గుడ్డు ధర కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగింది. ఇప్పుడు ఏకంగా రూ.7కు చేరింది.

బాలికలను విద్యాధికులను చేయటమే లక్ష్యం

- వసతిగృహం ఏర్పాటు మంచి కార్యక్రమం
- దగ్గుబాటి పురంధేశ్వరి, దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని బాలికలను విద్యాధికులను చేయడమే లక్ష్యంగా వసతిగహాన్ని ఏర్పాటుచేయటం మంచి కార్యక్రమమని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కాకతీయ సేవ సమాఖ్య ఆధ్వర్యంలో ఒంగోలు కొత్త మామిడిపాలెం రోడ్డులో బాలికల వసతి గహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావుతో పాటు పలువురు ఆత్మీయులు ఈ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి కాకతీయ సేవా సమాఖ్య జిల్లా అధ్యక్షులు కమ్మ వెంకటరావు అధ్యక్షత వహించారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ కాకతీయ సేవా సమాఖ్య ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కుల మతాలకు అతీతంగా సేవలను అందించాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికల వసతి గృహానికి స్థలాన్ని బహుకరించిన భగీరథ కెమికల్ ఇండస్ట్రీ యాజమాన్యాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు ఈదర హరిబాబు, దివిశివరాం, సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గోపాలకష్ణ, టొబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్, వెంకటరామయ్య, ఈదర మోహన్‌బాబు, శ్రీ హర్షిని విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, ప్రతిభా విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, బిజెపి జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, కామేపల్లి శ్రీనివాస రావు, బొద్దులూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

రెవెన్యూ సదస్సుల్లో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

రెవెన్యూ సదస్సుల్లో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి డిమాండ్ చేశారు. కనిగిరి పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆదివారం సిపిఎం కనిగిరి పట్టణ కమిటీ సమావేశం పిసి.కేశవరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జివి కొండారెడ్డి మాట్లాడుతూ రెవిన్యూ శాఖ నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులో పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వాగులు వంకలు, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆక్రమణల తొలగింపు చేపట్టాలని డిమాండ్ చేశారు. 191, 192, 193 సర్వే నెంబర్లలోని అనాధీన భూమిలో నివాసం ఉంటున్న పేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రజలతో ఉన్న దశ్య ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించాలని, కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల, మందుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రజా ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్కే బషీర, శాంత కుమారి, నరేంద్ర, ఏడుకొండలు, రమణమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్మించాలి

- వైద్యుల బదిలీలను నిలుపుదల చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతల డిమాండ్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయిందని, నిర్మాణ పనులను ప్రభుత్వమే పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే అందరికీ ప్రయోజనం కలుగుతుందని అఖిలపక్ష నేతలు పేర్కొన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణంపై స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం పట్టణ కార్యదర్శి డికెఎం రఫీ అధ్యక్షతన ఆదివారం జరిగింది. రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, ఆప్ నాయకులతో పాటు పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. మెడికల్ కళాశాల కోసం నియమించిన వైద్యులతో పాటు సిబ్బంది బదిలీలను నిలుపుదల చేయాలని కోరారు. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేయటాన్ని ఖండించారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న మార్కాపురంలోని సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లను బదిలీ చేయటాన్ని వ్యతిరేకించారు. పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత వైద్యం అందని ద్రాక్ష పండులా ఉందన్నారు. తీవ్రమైన జబ్బుల బారిన పడిన రోగులు వైద్యం కోసం వందల కిలోమీటర్ల దూరంలోని కర్నూలు, గుంటూరు, హైదరాబాద్, ఒంగోలు ప్రాంతాలకు వ్యయప్రయాసలకు ఓర్చి వెళుతున్నారు. మార్గమధ్యలో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మెడికల్ కళాశాల 70 శాతం పూర్తయిన నిర్మాణాన్ని నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం నిర్మాణాన్ని నిలిపివేయటం, డాక్టర్లను బదిలీ చేయటం వంటి చర్యలు మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ జపం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ ఆధీనంలో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కళాశాలను నిలుపుదల చేయటం, భవిష్యత్తులో ప్రైవేట్ భాగస్వామ్యంతో కళాశాలను నడుపుతామని చెప్పడాన్ని వారు వ్యతిరేకించారు. ఇదే విధానాన్ని అమలు చేస్తే అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత వైద్యం దూరం చేయడమే అవుతుందని, ఇటువంటి చర్యలు ప్రభుత్వం మానుకోవాలని, పేదలకు వైద్యం అందుబాటులో ఉంచాలని కోరారు. మార్కాపురం జిల్లా, ప్రభుత్వ మెడికల్ కళాశాల అంశాల్లో ప్రజాప్రతినిధులు తమ వైఖరి తెలియజేయాలన్నారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసొచ్చే పార్టీలు, ప్రజాసంఘాలు కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె అబ్దుల్‌రజాక్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ నాయకులు ఓ.వీరారెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జవ్వాజి రాజు, సిఐటియు టౌన్ కార్యదర్శి పి.రూబెన్, కాంగ్రెస్ నాయకులు పఠాన్ రిహానాభాను, సిపిఎం నాయకులు కాశయ్య, నాగరాజు, జి విక్టర్, ఎంపీజే నాయకుడు షేక్ మీరావలి, ఏఐటీయూసీ నాయకులు షేక్ కాశిం, వీసీకే పార్టీ నాయకులు పి.రాజు, సిపిఐ నాయకులు పెద్దన్న, యుటిఎఫ్ నాయకులు డి.శ్రీరాములు, పి.వెంకటేశ్వర్లు, ప్రభాకర్, సిఐటియు నాయకులు జి.హరి, యం.చెన్నకేశవులు, ఇమాంషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సోమయ్య

మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

మార్కాపురంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ ఏర్పడింది. స్థానిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ కమిటీ ఆవిర్భవించింది. కమిటీ కన్వీనర్‌గా సిపిఐ ఏరియా కార్యదర్శి అందే నాసరయ్య, కో కన్వీనర్‌గా సిపిఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, సభ్యులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, ఎంపీజే రాష్ట్ర నాయకులు షేక్ అబ్దుల్ రజాక్, యూటీఎఫ్ జిల్లా నాయకులు ప్రభాకర్, బిసికె పార్టీ నాయకులు ఎన్ రాజు, కాంగ్రెస్ నాయకులు విమోషే, ఆప్ నేతతో కమిటీ ఏర్పడింది.

వెంకటేశ్వర్లుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిఎస్.పురం గ్రామానికి చెందిన గువ్వల వెంకటేశ్వర్లుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అందజేశారు. రూ.68 వేల చెక్కును బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇంకొల్లులో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఇంకొల్లులో కరి లక్ష్మీ కుమారి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కళ్ళను కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. రోటరీ అవయవ దాన కమిటీ ఆధ్వర్యంలో శంకర కంటి నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి కార్నియాను సేకరించారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, గంగాధర్, కోడళ్ళు సు జాత, జమున, రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ముటుకుల ప్రాజెక్టు

- పేపర్‌పై నీళ్ళిచ్చినట్లు లెక్కలు
- మరమ్మతుల పేరుతో కోట్లు ఖర్చు
- ప్రజలకు అందని తాగునీరు
- కాంట్రాక్టర్లకు, అధికారులకు వరంగా మారిన వైనం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో సురక్షిత జలాలను అందించే ఉద్దేశ్యంతో 2008లో అప్పటి ప్రభుత్వం మండలంలోని ముటుకుల గ్రామంలో రూ.16.90 కోట్లతో రక్షిత మంచినీటి ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లోని 44 గ్రామాలకు నీరందించాల్సి ఉంది. అయితే నిర్మాణంలో లోపాలు, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఈ పథకం మూన్నాళ్ళ ముచ్చటగా మారింది. నాటి నుంచి నేటి వరకు లక్ష్యం ఎండమావిగా మిగిలింది. తరచూ పైప్‌లైన్ పగిలిపోవడం, పంపుల్లో సమస్యలు తలెత్తడం, ఫిల్టర్ బెడ్లులో ఆటంకాలు, దీనికంటే అధికంగా సంబంధిత శాఖాధికారుల అవినీతి, నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాజెక్ట్ పాలకులకు, ప్రజా ప్రతినిధులకు పాడి ఆవులా మారింది. పథకం ప్రారంభించి పదహారు యేండ్లు పూర్తి అవుతున్నా రక్షిత జలాల సరఫరా నామ మాత్రమే అన్నట్లు సాగుతోంది. పథకం పేరుకే అన్నట్లుగా మారింది. నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి.

ముటుకుల ప్రాజెక్టు

నిరుపయోగంగా మారిన ఫిల్టర్ బెడ్లు

నిర్వహణ పేరుతో కోట్ల వ్యయం..

తరచుగా మరమ్మతులకు గురవుతున్న ఈ పథకానికి నిర్వహణ పేరుతో కాంట్రాక్టర్లుకు కాసుల వర్షం కురుస్తోంది. ఇప్పటికే కోట్ల రూపాయలు నిర్వహణ, వేతనాలకే ఖర్చు చేసినట్లుగా నివేదికలు చెబుతున్నాయి. కానీ నీటి సరఫరా మాత్రం జరగడం లేదు. 2008లో నిర్మించిన ఈ త్రాగు నీటి పథకం లోపాల పుట్టగా మారింది. ఈ లోపాలపై అప్పటి యర్రగొండపాలెం ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ పాదయాత్ర చేశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. లోపాలమయమైన త్రాగునీటి ప్రాజెక్టును సందర్శించి జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని అప్పట్లో డిమాండ్ చేయగా పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది. అయితే ఆ తర్వాత మంత్రిగా వచ్చిన సురేష్ ప్రాజెక్టు అవినీతి, అక్రమాలపై నోరు విప్పకపోవడం పట్ల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. ఆయన ఐదేళ్ల పదవీ కాలంపై ప్రాజెక్టుపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం.

తాగునీరు కొనుగోలు చేయలేక..

ప్రజలు తాగునీరు కావాలంటే ఒక్కో బబుల్ రూ.10 రూపాయలు వెచ్చించి కొనుగోళ్లు చేయాల్సి వస్తోంది. స్వచ్ఛ నీరు అనే ఉద్దేశంతో తప్పని పరిస్థితుల్లో ఈ నీటిని వాటర్ ప్లాంట్ల ద్వారా కొందరు కొనుగోలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. పేదలు డబ్బులు వెచ్చించి కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు ప్రాజెక్టుపై లోతైన విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే శాశ్వతంగా నీటి సమస్య పరిష్కరించి, ప్రాజెక్టులో జరిగిన అవినీతిని వెలికితీసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కమాండ్ కంట్రోల్‌తో నేరాల నియంత్రణ

సౌత్ కోస్టల్ రేంజి ఐజి సర్వ శ్రేష్ట త్రిపాటి

ప్రజాశక్తి - చీరాల

కమాండ్ కంట్రోల్‌తో నేరాలను నియంత్రించవచ్చని సౌత్ కోస్టల్ రేంజ్ డీఐజీ శ్రీ సర్వశ్రేష్ట త్రిపాటి అన్నారు. ఆదివారం చీరాల వన్ టౌన్, కారంచేడు పోలీస్ స్టేషన్‌లను ఐజి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నేరం నియంత్రణలో పోలీస్ అధికారులు తీసుకోవలసిన చర్యల గురించి పలు సూచనలు ఇచ్చారు. సాధారణ తనిఖీలలో భాగంగా బాపట్ల జిల్లాలోని చీరాల వన్ టౌన్, కారంచేడు పోలీస్ స్టేషన్లను తనిఖీ చేయటం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ నేర నియంత్రణ కొరకు కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయటం వలన మెరుగైన సేవలను ప్రజలకు అందించవచ్చునన్నారు. చీరాల వన్ టౌన్, రామాపురం బీచ్ ప్రాంతాలలో ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించడం జరిగిందన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఐజి సర్వ శ్రేష్ట త్రిపాటి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో షుగరు వ్యాధికి ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్య శిబిరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 1037 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. నెల రోజులకు సరిపడు మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిబిరానికి హాజరైన వారందరికీ అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేశారు. కేవలం మందులపై ఆధారపడవద్దని వైద్యులు చెప్పారు. రోజువారీ జీవన విధానం, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే షుగర్ నియంత్రణలో ఉంచుకోవచ్చని సూచించారు. మానసిక ఆందోళన తగ్గించుకోవాలని చెప్పారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలని చెప్పారు. వైద్య శిబిరంలో డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ ప్రకాష్. డాక్టర్ సుధాకర్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, సాయి ఫణికిషోర్, చందన, కామేశ్వరరావు,ఎంజి శంకరరావు, బసవరావు, కుమార్, ఎ సురేష్, మిత్ర ల్యాబ్ వలి, గోపాల్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు.

ఒంగోలులో న్యూ ఇయర్ సందర్భంగా నిర్వహించనున్న 'అన్‌లాక్-2025' ఈవెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థులు రానున్న పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని ఎంఈవోలు రఘురామయ్య, రమాదేవిలు అన్నారు. డిసెంబర్ 22న ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్షను నిర్వహించడం జరిగింది. దర్శి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద ప్రశ్నా పత్రాలను మండల విద్యాశాఖాధికారులు కె.రఘురామయ్య, బి.రమాదేవి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు టి.రాజశేఖర్, ఎం.శ్రీనివాసులు, యుటిఎఫ్ మండల కార్యదర్శి పి.ఖాసిం, నాయకులు పి.రంగారావు, ఎం.తిరుపతిరెడ్డి, అవనింద్ర, కె.శ్రీనివాసరావు, ఎస్.ఏడుకొండలు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పిచ్చయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.విజయ్, దర్శి పట్టణ నాయకులు నాగేశ్వరరావు, చార్లెస్, ఆనంద్, బాబు తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేయడం మాత్రమే కాకుండా విద్యార్థులు విద్యారంగం అభివృద్ధి కోసం ప్రత్యామ్నాయ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అందులో భాగమే ఈ పరీక్షలు అన్నారు. ఎస్ఎఫ్ఐ, యుటీఎఫ్ భావితరాల భవిష్యత్తును ముందుకు తీసుకువెళ్లే దిశగా ఎన్నో కార్యక్రమాలు చెయ్యాలని చెప్పి, విద్యార్థులకి అభినందనలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.విజయ్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాల్లో ఈ పరీక్షల నిర్వహించారని తెలిపారు. 9,000 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారన్నారు. పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. పరిక్షలోనే కాక రానున్న కాలంలో ప్రశ్నించడం, హక్కులు సాధించుకోవడంలో కూడా ముందు ఉండాలని, అందుకు ఎస్ఎఫ్ఐ మీకు తోడుగా ఉంటుందన్నారు.

ప్రశ్నపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సోమిశెట్టి

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిఎస్.పురం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక ప్రత్యేక అధికారిగా జిల్లా ఆర్యవైశ్య సంఘం మెంబర్ ముప్వల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమంలో కనిగిరి ఆర్యవైశ్య ప్రముఖులు మారుతీరావు, మామిడి రమేష్, తడికమల వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్యవైశ్య ప్రముఖులు చెక్క చెన్నకేశవులు, సిఎస్.పురం ఆర్యవైశ్య ప్రముఖులు గ్రంధి హేమ సుందరం, గుబ్బ పూర్ణచంద్రరావు, సోమిశెట్టి సుబ్బారావు, సోమిశెట్టి సుబ్రహ్మణ్యం, దర్శి మోహన్‌రావు, ప్రసాద్, సోమిశెట్టి రాము, ఏల్చూరు రమణయ్య, కాపుగంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐలవరం విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఐలవరం ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం సూచించారు. విద్యార్థులు స్కైప్ ద్వారా విదేశాలలోని విద్యార్థులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. దీనిలో భాగంగా అమెరికాలోని ఓ పాఠశాల విద్యార్థులు రాసి ఉత్తరాలను డీఈవో చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి వినూత్న కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ విద్యార్థులతో పాటు పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు పచ్చారు హరికృష్ణను డిఈఒ అభినందించారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి: ఉగ్ర

ప్రజాశక్తి-సిఎస్.పురం

ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని చింతపూడు పంచాయతీలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఇస్తున్నదని తెలిపారు. వేసిన పంటకు ప్రతి రైతు ఈ క్రాప్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఇటీవల వర్షం వల్ల మినుము, శనగ పంటలు దెబ్బతిన్నాయని నష్ట పరిహారం ఇప్పించాలని కొంతమంది రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా జాబితాను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం సబ్సిడీపై యంత్రాలను కూడా అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 80 శాతం సబ్సిడీపై వచ్చిన శనగలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడి రమణ, పామూరు సిఎస్.పురం ఏఓలు రాధా, సంపత్‌కుమార్, పలువురు రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఏపీ ఎన్‌జీవో సంఘం అధ్యక్షులు పిల్లి వెంకట రమణారెడ్డి

ఎన్జీవో సంఘ నాయకులను సత్కరిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి -కనిగిరి

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎన్‌జీవో సంఘం అధ్యక్షులు పిల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ మరియు గేజిటెడ్ ఉద్యోగుల సంఘ భవనంలో కనిగిరి తాలూకా నాన్ గెజిటెడ్ మరియు గెజిటెడ్ సంఘ అధ్యక్షులు పిల్లి వెంకట రమణారెడ్డి అధ్యక్షతన ఆదివారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ వేతన సవరణను కమిషన్ గడువు దాటి 15 నెలలుగా గడిసిందని, పీఆర్‌సీ కమిషనర్ నియామకాన్ని వెంటనే చేపట్టాలన్నారు. పెండింగ్ డిఏలు మంజూరు చేయాలన్నారు. ఇన్టీరియం రిలీఫ్ ప్రకటించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు, జీపీఎఫ్ మొత్తాలు, పోలీసు సిబ్బందికి సరెండర్ లీవ్ చెల్లింపులు సహా మొత్తం రూ.25,000 కోట్లు పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఉద్యోగుల నుంచి నెలసరి ప్రీమియం కడుతున్నప్పటికీ హెల్త్‌కార్డులు సక్రమంగా పనిచేయడం లేదని నగదు రహిత వైద్య సదుపాయాలను అందించేవిధంగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న అన్ని శాఖలలోని మరియు గ్రామ, వార్డు సచివాలయంలలోని అన్ని పోస్టులను భర్తీ చేయాలని, కోరారు. సమావేశానికి హాజరైన ఉద్యోగులు వివిధ సమస్యలను తెలిపారు. సచివాలయ ఉద్యోగస్తుల బయోమెట్రిక్ హాజరు విధానాన్ని సవరించి, ఏపీఎఫ్ఆర్ఎస్ విధానంలాగే సదరు ఉద్యోగుల ఉద్యోగ పరిధిలో ఎక్కడైనా హాజరు నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించాలన్నారు. నిర్దేశిత పరిధిలో హాజరు విధానాన్ని ఫీల్డ్ స్టాఫ్‌కి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రతి సచివాలయానికి స్వీపర్ మరియు ఆఫీస్ సబ్ ఆర్డినెట్‌ని నియమించాలని ,సచివాలయాలకి స్టేషనరీ, కరెంట్ బిల్, ఇతర ఖర్చులు నిమిత్తము రూ.10వేలు బడ్జెట్ కేటాయించాలన్నారు. ఏఎన్ఎం లకు అమలులో ఉన్న వైద్య ఆరోగ్య శాఖ వారి ఉత్తర్వులు ప్రకారము హాజరుతో సంబంధం లేకుండా వైద్య అధికారుల డ్యూటీ సర్టిఫికెట్ ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. సచివాలయ ఉద్యోగులచే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కానుక పంపిణీ, కార్యాలయ పనివేళలలో మాత్రమే పంపిణీ చేసేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని, అదే రోజు మొత్తం పంపిణీ చేసేందుకు సచివాలయం సిబ్బంది సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పై సమస్యలను పరిష్కార నిమిత్తము జిల్లా కార్యవర్గానికి పంపడానికి తీర్మానించారు. ఈ సమావేవంలో ప్రమోషన్ మరియు బదిలీల్లో భాగముగా ఖాళీగా ఉన్న స్థానాలలో కొత్తవారితో భర్తీ చేశారు. కార్యవర్గ సభ్యులను ఈ సాధారణ సమావేశములో ఏకగ్రీవంగా ఎన్నుకొనుటకు ఆమోదిస్తూ ఎన్నుకున్నారు. ఎస్ కే యం డి రషీద్ కార్యపర్యవేక్షకులుగా, జి.వెంకట స్వామి వ్యవసాయాధికారిగా పదోన్నతి పొందగా కె.నాగ మల్లేశ్వర రెడ్డి, యస్.సుబ్బారెడ్డి బదిలీ అయ్యారు. ప్రమోషన్ మరియు బదిలీపై వెళ్లిన క్రింద తెలిపిన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. యం.జక్రయ్య సహాధ్యక్షులుగా, బి.మల్లికార్జున ఉపాధ్యక్షులుగా, బి.వెంకట సుబ్బయ్య ఉపాధ్యక్షులుగా, షేక్ నాసర్ వలి ఆర్గనైజింగ్ సెక్రటరీగా, షేక్ ఆరఫత్ జాయింట్ సెక్రటరీగా, ఎన్.పుల్లయ్య జాయింట్ సెక్రటరీగా, షేక్ మస్తాన్ వలి స్టేట్ ఈసీ మెంబర్‌గా ఎన్నుకున్నారు.

పేదల సేవలోనే నిజమైన ఆనందం

సినీ స్టంట్ మాస్టర్ కింగ్ సాల్మన్

పేదలకు వస్త్రాలు, బియ్యం పంపిణీ

పేదలకు పంచడానికి సిద్ధం చేసిన బియ్యంతో సాల్మన్

ప్రజాశక్తి - చీరాల

పేదలకు సేవ చేసేందుకే కింగ్ సాల్మన్ ఫౌండేషన్ ఏర్పాటు చేశానని సినీ స్టంట్ మాస్టర్ కింగ్ సాల్మన్ అన్నారు. చీరాల మండలం తోటవారిపాలెం పంచాయతీలోని సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కింగ్ సాల్మన్ మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో జన్మించానని, చీరాల పరిసర ప్రాంతాలలో చదువుకుని సినీ స్టంట్ మాస్టర్‌గా ఎదిగానని అన్నారు. తాను జన్మించిన గడ్డను మరచిపోకుండా నియోజకవర్గ ప్రజలకు సేవ చెయ్యాలని ఫౌండేషన్ స్థాపించానని తెలిపారు. నిజమైన పేదలకు ఫౌండేషన్ ద్వారా సహాయం చేస్తానని అన్నారు. ఇప్పటికే సినీరంగంలో రెండు సార్లు జాతీయ అవార్డు అందుకున్నానని అన్నారు. సొంత ఊరిలో నియోజకవర్గంలోని పేదలకు ఉచితంగా గత ఇరవై ఏళ్లుగా సేవ చేస్తున్నానని ఇకపై తమ సేవలు నియోజకవర్గ స్థాయిలో విస్తృతపరచేందుకు ఫౌండేషన్ ఏర్పాటు చేశానన్నారు. ప్రస్తుతం రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఎస్ఎస్ఎంబి చిత్రానికి పని చేయబోతున్నానన్నారు. నేటి నుంచి పది రోజుల పాటు పేద వితంతువులకు, వృద్ధులకు ఉచితంగా బియ్యం, నూతన వస్త్రాలు అందిస్తానని తమ తమ ప్రాంతాలలో ఉన్న పేదలకు సమాచారం అందించాలని కోరారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

బాలికల వసతి గృహం తనిఖీ

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని శిలంవారిపల్లిలో బాలికల వసతి గృహాన్ని ఆదివారం జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎం.అంజలా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. బాలికలకు సక్రమంగా ఆహారం పంపిణీ జరుగుతున్నదా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా అవకతవకలు జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్టల్ పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డి.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

వేడుకలలో నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - చీరాల

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని స్థానిక మరియమ్మ పేటలోని సెయింట్ ఆన్స్ స్కూల్లో శనివారం మేరీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను సుందరంగా అలంకరించారు. క్రీస్తు జననం తెలిపే విధంగా చక్కని ప్రతిమలు ఏర్పాటు చేసి లైటింగ్‌తో అలంకరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బాపట్ల ఉడా చైర్మన్ సలగల రాజశేఖర్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చిన్నారులు దేవుని స్వరూపులని చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు చదువు నేర్పిన గురువులు గర్వపడేలా మంచి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. క్రమశిక్షణకు మారుపేరుగా సెయింట్ ఆన్స్ స్కూలు ఉన్నదని ఆయన స్కూలు యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం స్కూలు విద్యార్థిని, విద్యార్థులు రంగురంగుల వస్త్రధారణలు ధరించి ప్రదర్శించిన నృత్యాలు, క్రీస్తు జననం నాటికలు ఆహూతులను ఆలరించాయి. ముందుగా ఎన్సీసీ విద్యార్థులు పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జేవియర్, కరస్పాండెంట్ సిస్టర్ ఎల్లా ట్రెసా, స్కూలు పూర్వ విద్యార్థులు. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్లపాలెం: ఏసుక్రీస్తు జననం ఈ లోకంలో సాటివారిని ప్రేమించాలని గొప్ప సందేశాన్ని సమాజానికి అందజేసిందని పెనుయేలు మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు కాగిత డేవిడ్ తెలియజేశారు. కర్లపాలెం మండలం నర్రావారిపాలెంలో పెనుయేల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులుగా హాజరైన రెవరెండ్ ఇమాన్యుల్ విన్నకోట మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన మహోన్నతమైన దేవుడు యేసు క్రీస్తు అని ఆయన జన్మని గుర్తు చేసుకుంటూ క్రిస్మస్ వేడుకలు చేసుకోవటం గొప్ప ఆనందాన్ని ఇస్తుందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దైవ సేవకులకు నూతన వస్త్రాలను, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కాగిత డేవిడ్ రెవరెండ్ దైవ సేవకులు ఇమాన్యుల్, రవికుమార్, జాషువా, డేవిడ్, సురేష్, స్టీవెన్, సత్యానందంకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

కొల్లూరు: మండల కేంద్రం కొల్లూరులో ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఆవరణలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీఐ సీనియర్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన చేతుల మీదగా ఢిల్లీ అబాకాస్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్న స్కూలు విద్యార్థికి షీల్డ్ అందజేశారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు వారి తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ టి నవీన్‌పాల్, ప్రిన్సిపాల్ అనిత కుమారి రాజన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి షీల్డ్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

హెల్మెట్ ఆవశ్యకతపై పోలీసుల ర్యాలీ

ప్రజాశక్తి-సంతమాగులూరు

హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం మృతి చెందుతున్నారని సంతమాగులూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు తెలిపారు. ఆదివారం ఎస్పీ తుషార్ డూడి, డీఎస్పీ జి.రామాంజనేయులు ఆదేశాల మేరకు సంతమాగులూరు సర్కిల్ పరిధిలోని బల్లికురవ, సంతమాగులూరు మండలాల పోలీస్ అధికారులు సిబ్బంది హెల్మెట్ ధరించి మండలంలోని అన్ని గ్రామాలలో వాహన ర్యాలీ నిర్వహించి, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటరావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి రక్షణ కవచం హెల్మెట్ అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు తాము ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.పట్టాభిరామయ్య, జీవి చౌదరి, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న ఇంకొల్లు రంగారావు

జెవివి నాయకుడు రంగారావుకు అబ్దుల్ కలాం పురస్కారం

ప్రజాశక్తి-చెరుకుపల్లి

విశ్రాంత సైన్స్ ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా గౌరవ అధ్యక్షులు ఇంకొల్లు రంగారావుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విజ్ఞాన గురు పురస్కార్ అవార్డు అందజేశారు. డాక్టర్ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ మరియు సుగుణ సైన్స్ అకాడమీ వింజనంపాడు, గుంటూరు వారు విద్యాభివృద్ధికి మరియు సైన్స్ రంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా అవార్డును అందజేశారు. గుంటూరు హిందూ కళాశాల సుదర్శన ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అవార్డు అందుకున్న ఇంకొల్లు రంగారావును ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, ఎంఈఓలు పులిలాజర్, టి.నవీన్ కుమార్, జన విజ్ఞాన వేదిక నాయకులు కాటూరి నాగేశ్వరరావు, కుంచ వెంకట రామ మోహన్ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు 'తెలగతోటి'కి పరామర్శ

ప్రజాశక్తి - పంగులూరు

అనారోగ్యంతో బాధపడుతున్న పంగులూరు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తెలగ తోటి రాధాకృష్ణమూర్తిని సంతనూతలపాడు నియోజకవర్గానికి సంబంధించిన పలువురు నాయకులు ఆదివారం పరామర్శించారు. మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామంలో తేలగతోటి రాధాకృష్ణమూర్తి ఇంటికి వెళ్లి నాయకులు ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి వేమా శ్రీనివాసరావు, మాల మహానాడు ప్రకాశం జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, ఒంగోలు 33వ డివిజన్ టీడీపీ ఇన్చార్జి జగన్నాథం మురళీమోహన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో

ఉమ్మడి ప్రకాశం జట్టుకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-పంగులూరు

తిరుపతి జిల్లా పుత్తూరులో జరిగిన అండర్ 19 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ నెల 21 నుండి జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో 22వ తేదీన ఆదివారం జరిగిన చిత్తూరు జిల్లా జట్టుపై ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు విజయం సాధించి.. ప్రథమ స్థానానికి చేరుకున్నట్లు రాష్ట్ర ఖో ఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి చరవాణి ద్వారా 'ప్రజాశక్తి'కి తెలియజేశారు. ఫైనల్ మ్యాచ్‌కి చంద్రగిరి శాసనసభ్యులు భానుప్రకాష్ వచ్చి.. విజయం సాధించిన ఉమ్మడి ప్రకాశం బాలుర జట్టును అభినందించారు. ఈ జట్టు 20 రోజులు పాటు పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి మరియు బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో గల ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందినట్లు సీతారామిరెడ్డి తెలిపారు. గత 25 సంవత్సరాలుగా అండర్ -19 ఉమ్మడి ప్రకాశం బాలుర జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధిస్తున్నారని, ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులను సీతారామిరెడ్డి అభినందించారు.

ప్రథమ స్థానం సాధించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు

ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

బాగా చదివి పరీక్షలకు సిద్ధంకండి

యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధం కావాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి పిలుపు నిచ్చారు. ఆదివారం ప్రకాశం జిల్లావ్యాప్తంగా 10 కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస పరీక్షను నిర్వహించారు. ఒంగోలు పివిఆర్ పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద ప్రశ్నా పత్రాలను యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి, యుటిఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ, జనవిజ్ఞానవేదిక నాయకులు సుబ్రహ్మణ్యం, జయప్రకాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ ఒంగోలు నగర కార్యదర్శి బండి వీరాస్వామి ఎస్ఎఫ్ఐ నాయకులు దేవ, రాజశేఖర్, విజయ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేయడం మాత్రమే కాకుండా విద్యార్థులు విద్యారంగం అభివృద్ధి అవడం కోసం ప్రత్యామ్నాయ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగానే పదోతరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు పట్ల భయాన్ని పోగొట్టి అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాల్లో ఈ పరీక్షల నిర్వహించారు. 9,000 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు.

రక్షణ కవచం 'హెల్మెట్'

ఒంగోలులో ట్రాఫిక్ సిఐ పాండురంగారావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని ట్రాఫిక్ సిఐ వై.పాండురంగారావు తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రకాశం ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సిఐ పాండు రంగారావు ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు నగరంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ప్రజలు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది, రాయల్ ఎన్ఫీల్డ్ షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో ట్రాఫిక్ పోలీసులు

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు ప్రారంభం

- కొండపిలో స్టేడియం పనులు త్వరలో ప్రారంభిస్తాం..
- మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

మాట్లాడుతున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం, పాకల జిల్లా పరిషత్ హైస్కూల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17, 19 బాలబాలికల క్యారమ్స్ రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారం నాడు ప్రారంభమయ్యాయి. ఈ రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలను రాష్ట్ర సాంఘిక, సంక్షేమ సచివాలయ వాలంటీర్ల వయోవృద్ధుల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండా, క్రీడా జెండా ఎగురవేసి క్రీడా జ్యోతిని వెలిగించారు. అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పరిచయ కార్యక్రమం ముగిసిన అనంతరం జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో క్రీడలను, క్రీడాకారులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని పాఠశాలలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామన్నారు. శింగరాయకొండలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 95 లక్షల రూపాయలతో ఇండోర్ స్టేడియం నిర్మాణం జరుగుతుందని, గురుకుల విద్యార్థులకు ప్రత్యేకంగా ఆటల్లో శ్రద్ధ చూపేలా ప్రత్యేకంగా చూస్తున్నామని వివరించారు. పేద కుటుంబాల్లో మెరికల్లాంటి క్రీడాకారులను వెలికితీసి.. వారిని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి క్రీడాకారులకు ప్రత్యేకమైన ప్రోత్సాహం ఉంటుందన్నారు. అమరావతిలో స్టేడియం నిర్మాణం చేపడతామని, కొండేపి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న స్టేడియం పనులను త్వరలో ప్రారంభోత్సవం చేసే విధంగా పనిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి స్వయంగా క్యారమ్స్ ను ఆడారు. ఈ క్యారమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేందుకు ప్రకాశం, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, నెల్లూరు, కృష్ణా, కర్నూలు, గుంటూరు, తూర్పుగోదావరి, కడప, చిత్తూరు అనంతపురం జిల్లాల నుంచి క్రీడాకారులు 400 మంది పాఠశాల విద్యార్థులతో పాటు ఇంటర్ విద్యార్థులు వచ్చారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివిఎస్ ప్రసాద్ అధ్యక్షత వహించగా మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసరావు, అజీరా బేగం, వై.శ్రీను, ఎన్‌టి.ప్రసాద్, పి.హజరత్తయ్య, సీఐ సిహెచ్. హజరత్తయ్య, సర్పంచ్ సైకం చంద్రశేఖర్, వేల్పుల సింగయ్య, ఎస్ఐ బి.మహేంద్ర పాల్గొన్నారు.

మంత్రి స్వామిని కలిసిన 'ఉపాస్' డైరెక్టర్లు

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్ర సాంఘిక, సంక్షేమ, సచివాలయ, వాలంటీర్ల వృద్ధుల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామిని ఆదివారం నాడు ఉపాస్ హాస్పిటల్స్ డైరెక్టర్స్ డాక్టర్ జి.ఉమాపతిచౌదరి, డాక్టర్ ప్రకాష్‌చావల, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ స్వామిని ఘనంగా సత్కరించారు.

మంత్రి స్వామిని సత్కరిస్తున్న ఉపాస్ డైరెక్టర్లు

రైతాంగ సంక్షేమమే ధ్యేయం

- రైతులకు అండగా ఉంటాం..- బాపట్ల జిల్లా సహకార శాఖ అధికారి సిహెచ్.శ్యాంసన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా జిల్లా వ్యవసాయ సహకార శాఖ ద్వారా తగిన కృషి చేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి సిహెచ్.శాంసన్ తెలిపారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా అందజేస్తున్న రైతాంగ రుణాలు, సంక్షేమ పథకాల అమలు గురించి, రైతులకు అండగా ఉంటూ వారి ఆర్థిక స్థితిగతులు మెరుగు పడేలా తమ శాఖ ద్వారా చేస్తున్న కృషిని జిల్లా సహకార శాఖ అధికారి శ్యాంసన్ 'ప్రజాశక్తి'తో ముఖాముఖిలో వివరించారు.

జిల్లాలో ఉన్న 112 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు సల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నారు. కార్పొరేట్ బ్యాంకులతో సమానంగా జిల్లాలోని సహకార సంఘాలను తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా అన్ని సంఘాలను కంప్యూటరీకరణ చేయనున్నారు. సహకార సంఘాల కంప్యూటరీకరణ ద్వారా రైతుల లావాదేవీలు అత్యంత పారదర్శకంగా జరగనున్నాయి. జిల్లాలో ఉన్న 112 సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. గడిచిన ఆరేళ్ళుగా సహకార సంఘాలకు ఎన్నికలు జరగనందున పర్సన్ ఇన్‌చార్జీ పాలనలో సంఘాలు ఉన్నాయి. ప్రస్తుతం సంఘాలకు ఎన్నికలు జరుపుతారా లేక త్రిమెన్ కమిటీ నియామకాలు జరుగుతాయా.? అనే విషయమై రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవలసి ఉంది.

నూతన గోడౌన్ల నిర్మాణాలు

జిల్లాలో ఉన్న రైతుల అవసరాల మేరకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పరిధిలో బహుళ ప్రయోజనాల గోడౌన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. తొలి విడతగా 45 గోడౌన్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిర్మాణాలు జిల్లా మార్కెటింగ్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఒక్కొక్క గోడౌన్ రూ 40 లక్షల నిధులతో నిర్మించడం జరుగుతుంది. అందులో ఇప్పటి వరకు 25 గోడౌన్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన 20 గోడౌన్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో రెండో విడతగా 103 గోడౌన్లు జిల్లాకు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలకు స్థలాలను గుర్తించడం జరుగుతోంది. జిల్లాలో ఉన్న పాత గోడౌన్ల మరమ్మత్తులు జరిపేందుకు రూ.5 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించడం జరిగింది. టెండర్లు పిలిచారు కానీ కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాకపోవడంతో వీటి మరమ్మతుల పనులు జరగలేదు. రైతులు తమ పంటలను నిల్వ చేసుకునే అవసరాలకు అనుగుణంగా అన్ని గోడౌన్లకు మరమ్మత్తులు జరపాలని రాష్ట్రప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో తగిన ప్రతిపాదనలు రూపొందిండం జరుగుతుంది.

సహకార సంఘాల నేతృత్వంలో పెట్రోల్ బంకుల నిర్వహణ

జిల్లాలోని పర్చూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న సహకార సంఘాల నేతృత్వంలో పావులూరు, ఇంకొల్లు, అడుసుమల్లి, నాగులపాలెం వద్ద పెట్రోల్ బంకులను కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేశారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని సహకార సంఘాలు కొన్ని సంవత్సరాలుగా కోట్ల రూపాయల మేర ఆదాయపన్ను బకాయిలున్నాయంటూ ఆ శాఖ అధికారులు నోటీసులు పంపిన విషయమై న్యాయ సలహాలు తీసుకుంటున్నారు. జిల్లాలో 112 సహకార సంఘాలుండగా అన్నిటికీ నోటీసులు వెళ్ళాయి. కొన్ని సంఘాల బ్యాంకు ఖాతాలను అధికారులు సీజ్ చేశారు. జిల్లాలో ఉన్న సహకార సంఘాలు పాన్‌కార్డు తీసుకోవడం, ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా ఆదాయపుపన్ను బకాయిలు ఉన్నట్లు వచ్చింది. ఈ విషయమై తగు చర్యలు తీసుకుని, రైతులకు ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో ఉన్న వేటపాలెం కో ఆపరేటివ్ సొసైటీ, నూజిళ్ళపల్లి సొసైటీల్లో నిధుల గోల్‌మాల్ జరిగిన నేపథ్యంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. నూజిళ్ళపల్లి సొసైటీలో రూ 2 .20 కోట్ల మేర అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలకు జిల్లా కలెక్టర్ అనుమతి లభించింది. వేటపాలెం సొసైటీ లో జరిగిన అక్రమాలపై విచారణ పూర్తయింది. నిధుల రికవరీ కోసం చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..